# అభివృద్ధిని చూడండి..
# అబద్ధాలను నమ్మొద్దు

- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- రూ.149కోట్లతో చేపట్టనున్న కంబైన్డ్ లిఫ్ట్ నిర్మాణ పనులకు శంకుస్థాపన



చిట్టాపూర్‌లో కొబ్బరికాయ కొట్టి లిఫ్టు పనులను ప్రారంభిస్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

బాల్కొండ, అక్టోబర్ 1: కాంగ్రెస్ నాయకులు వచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తారని, వారి మాటలు కాకుండా మీ కండ్ల ముందు కనిపిస్తున్న అభివృద్ధిని చూడాలని, మభ్యపెట్టే హామీలతో వచ్చే వారితో రైతులు, ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రోడ్లు భవనాలు, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. బాల్కొండ మండలంలోని చిట్టాపూర్ గ్రామంలో రూ.149కోట్లతో 3,500ఎకరాలకు సాగునీళ్లందించే బాల్కొండ, చిట్టాపూర్, సుర్బిర్యాల్ లిఫ్ట్ నిర్మాణ పనులకు మంత్రి వేముల ఆదివారం శంకుస్థాపన చేశారు. తమ చిరకాల వాంఛను తీర్చుతున్న మంత్రికి రైతులు, గ్రామస్తులు గజమాలతో సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ స్వయానా రైతు కాబట్టే రైతు కష్టాలు పూర్తిగా తెలుసన్నారు. అందుకే పెట్టుబడిసాయం, 24 గంటల ఉచిత కరెంట్, సాగు నీటి గోస తీర్చి రైతుకు భరోసాగా నిలిచారన్నారు. నాడు బీడు భూములతో దిగులుగా ఉన్న రైతు, నేడు కేసీఆర్ వల్ల పచ్చని పైరులతో ముఖం మీద చిరునవ్వుతో ఉన్నాడని తెలిపారు. నియోజకవర్గంలో ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకం ద్వారా గుత్ప, చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి, లక్ష్మీ లిఫ్ట్ ద్వారా చెరువులు నింపుకొంటున్నామని, దీంతో వేసవికాలంలో కూడా చెరువులు నిండుకుండలా ఉన్నాయని తెలిపారు. 300కిలోమీటర్ల కింద నుంచి కాళేశ్వరం నీటిని ఎస్సారెస్పీకి ఎదురెక్కించిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. చిట్టాపూర్ లిఫ్ట్ ద్వారా 3,500 ఎకరాలకు సాగు నీటి సౌలభ్యం కానున్నదని, అందులో చిట్టాపూర్ 2వేల ఎకరాలు, బాల్కొండ 1240 ఎకరాలు, శ్రీరాంపూర్ 282 ఎకరాలకు కొత్తగా లిఫ్ట్ ద్వారా సాగునీరు అందనున్నదన్నారు. బాల్కొండ రైతులు సాగునీటి కోసం రోడ్ల మీద ధర్నాలు చేశారని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు రైతులను అరిగోస పెట్టి, ఇప్పుడు రైతులను ఆదుకుంటామని హామీలిస్తున్నారని, వారిని నమ్మితే మళ్లీ పాత రోజులే, పాత గోసలేనని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వనజాగోవర్ధన్‌గౌడ్, ఎంపీపీ లావణ్యాలింగాగౌడ్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మధుశేఖర్, డీసీసీబీ వైస్‌చైర్మన్ రమేశ్‌రెడ్డి, కోటపాటి నర్సింహానాయుడు, ఇరిగేషన్ సీఈ మధుసూదన్, మండల పార్టీ అధ్యక్షుడు బద్దం ప్రవీణ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీకాంత్ యాదవ్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ఉపసర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# దేశంలోనే నంబర్‌వన్
# సెక్యులర్ లీడర్ కేసీఆర్

- రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ
- కేసీఆర్ పాలన గంగా జమునా తెహజీబ్
- అభివృద్ధి చేసే ప్రశాంత్‌రెడ్డికి మైనార్టీలు మద్దతుగా నిలవాలి
- రానున్న ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించాలి

వేల్పూర్, అక్టోబర్ 1: దేశంలోనే నంబర్‌వన్ సెక్యులర్ లీడర్ సీఎం కేసీఆర్ అని, రాష్ట్రం లో కేసీఆర్ పాలన గంగా జమునా తెహజీబ్‌ను తలపిస్తున్నదని హోంశాఖ మంత్రి మహమూద్ అలీ అన్నారు. ముస్లిముల అభ్యున్నతికి గతం లో ఏ నాయకుడూ కేసీఆర్‌లాగా ఆలోచన చేయలేదన్నారు. వేల్పూర్ మండలం లక్కోర గ్రామంలోని ఏఎన్‌జీ ఫంక్షన్ హాల్‌లో బాల్కొండ నియోజకవర్గంలోని ముస్లిం మైనార్టీ మసీదుల అభివృద్ధికి మంజూరైన రూ.3కోట్లకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీలను రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డితో కలిసి ఆదివారం అందజేశారు. అనంతరం హోం మంత్రి మాట్లాడుతూ ముస్లిం బిడ్డకు రాష్ట్ర తొలి డిప్యూటీ సీఎం, రెండోసారి హోంశాఖ మంత్రి పదవులు ఇచ్చి యావత్ తెలంగాణ ముస్లిం మైనార్టీ ప్రజలను సీఎం కేసీఆర్ గౌరవించారన్నారు. కేసీఆర్ వచ్చిన తర్వాత ముస్లిములు ఎంతో అభివృద్ధి చెందుతున్నారన్నారు. హింసకు తావు లేకుండా, గాంధేయ మార్గంలో రాష్ట్రాన్ని సాధించి, అనతి కాలంలోనే రాష్ట్రాన్ని అభివృద్ధిలో నంబర్ వన్ చేసిన వ్యక్తి కేసీఆర్ అని కొనియాడారు. బాల్కొండ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి చూస్తుంటే సంతోషం కలుగుతున్నదన్నారు. కేసీఆర్‌కు అతి దగ్గరగా, ఆయన మదిలో ఉండే వ్యక్తి ప్రశాంత్ రెడ్డి అని, ప్రశాంత్‌రెడ్డి లాంటి మంచి మనసున్న నాయకుడు ఉండడం బాల్కొండ నియోజకవర్గ ప్రజల అదృష్టమన్నారు. మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తండ్రి వేముల సురేందర్‌రెడ్డితో ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా హోంమంత్రి మహమూద్ అలీ గుర్తుచేసుకున్నారు. తండ్రి ఆశయాలకు అనుగుణంగా మంత్రి ప్రశాంత్‌రెడ్డి పని చేస్తున్నారని ప్రశంసించారు. అభివృద్ధి చేసే ప్రశాంత్‌రెడ్డికి మైనార్టీలు మద్దతుగా నిలవాలని, రానున్న ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.




మాట్లాడుతున్న హోంమంత్రి మహమూద్ అలీ

## మైనార్టీలకు పెద్దపీట

**రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్‌రెడ్డి**

కేసీఆర్ ప్రభుత్వం మైనార్టీలకు పెద్దపీట వేస్తున్నదని రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్‌రెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ నిరంతరం మైనార్టీల బాగు కోసం కృషి చేస్తున్నారని, ముస్లిములకు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వారు ఆర్థికంగా బలోపేతమయ్యేలా శ్రమిస్తున్నారని అన్నారు. అనంతరం మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా మంజూరైన 300 కుట్టు మిషన్లను లబ్ధిదారులకు మంత్రులు మహమూద్ అలీ, వేముల ప్రశాంత్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మధుశేఖర్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఇంతియాజ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కోటపాటి నర్సింహ నాయుడు, డీసీసీబీ వైస్‌చైర్మన్ రమేశ్‌రెడ్డి, ఆర్మూర్ ఆర్డీవో వినోద్, ఏసీపీ జగదీశ్ చందర్, నియోజకవర్గంలోని మైనార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న ముస్లిం మైనార్టీలు

## మైనార్టీల అభ్యున్నతికి కేసీఆర్ కృషి



**మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి**

ముస్లిం పిల్లలు విద్యలో ప్రపంచంతో పోటీ పడాలనేది సీఎం కేసీఆర్ ఆకాంక్ష అని, ముస్లిం పిల్లలు కూ డా డాక్టర్లు, ఇంజినీర్లు, పైలట్లు, సైంటిస్టులు,మేధావులు ఎందుకు కాకూడదనే ఆలోచనతో సీఎం కేసీఆర్ మైనార్టీల అభ్యున్నతికి విశేష కృషి చేస్తున్నారని రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని బాల్కొండ, భీమ్‌గల్‌లో మైనార్టీ గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేశామన్నారు. షాదీముబారక్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 2లక్షల మంది లబ్ధిదారులకు రూ.240 కోట్లు ఇవ్వగా, బాల్కొండ నియోజకవర్గంలోనే రూ.200కోట్లు పింఛన్ల కింద లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. గతంలో మైనార్టీలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూశారని, ఏనాడూ వారి అభివృద్ధి పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కేసీఆర్ వచ్చిన తర్వాత మైనార్టీల జీవితాల్లో వెలుగులు నింపారని అన్నారు. మైనార్టీలను గుండెలో పెట్టుకొని కాపాడుకునే కేసీఆర్‌కు ఎల్లప్పుడూ మద్దతుగా నిలవాలని కోరారు.

- భూమిపూజ చేసిన మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్
- సంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికిన గిరిజనులు
- బహిరంగసభలో ప్రసంగించిన నేతలు



బహిరంగ సభలో పాల్గొన్న నాయకులు, గిరిజనులు



బంజారా భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం భూమారెడ్డి కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

మాట్లాడుతున్న మంత్రి సత్యవతి రాథోడ్

# ఆత్మగౌరవ సౌధానికి
# అంకురార్పణ

## రూ.3కోట్లతో
## బంజారా భవన్‌కు శంకుస్థాపన



భోగ్‌భండార్‌లో పూజలు చేస్తున్న మంత్రి సత్యవతిరాథోడ్, ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, పౌరాదేవి పీఠాధిపతి బాబూసింగ్, ధర్పల్లి జడ్పీటీసీ బాజిరెడ్డిజగన్ తదితరులు

డిచ్‌పల్లి /ఖలీల్‌వాడి, అక్టోబర్ 1: నిజామాబాద్ నగర శివారులోని పాంగ్రాలో రాష్ట్ర ప్రభుత్వం రూ.3కోట్లతో నిర్మించనున్న జిల్లా బంజారా భవన్‌కు గిరిజన, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పౌరాదేవి పీఠాధిపతి బాబూసింగ్ మహరాజ్ ఆధ్వర్యంలో భోగ్‌భండార్ నిర్వహించారు. అంతకుముందు పాంగ్రాకు వచ్చిన ప్రజాప్రతినిధులకు గిరిజనులు సంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు. గిరిజనులతోపాటు నేతలూ డ్యాన్స్ చేసి ఆకట్టుకున్నారు. అనంతరం సమీపంలోని భూమారెడ్డి కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన బహిరంగసభలో నేతలు, ప్రజాప్రతినిధులు ప్రసంగించారు. కార్యక్రమాల్లో జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, ఒలింపిక్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, ధర్పల్లి జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, బీఆర్ఎస్ ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్, డీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, నుడా చైర్మన్ సంజీవ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, ఆర్అండ్‌బీ చీఫ్ ఇంజినీర్ మోహన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ పాలనలో.. గిరిజనులకు స్వర్ణయుగం

**రాష్ట్ర గిరిజన, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్**

సీఎం కేసీఆర్ పాలనలో గిరిజనులకు స్వర్ణయుగం వచ్చిందని, దేశంలో గిరిజనుల హక్కుల కోసం, వారి అభివృద్ధికి మనసు పెట్టి పనిచేసిన సీఎం కేసీఆర్ ఒక్కరేనని రాష్ట్ర గిరిజన, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. గిరిజన బిడ్డల నుంచి పుట్టిందే కల్యాణలక్ష్మి పథకమని చెప్పారు. బతుకమ్మను ప్రపంచ పటంలో చూపించిన, తెలంగాణ ఉద్యమ సమయంలో మహిళలందరినీ ఏకతాటిపైకి తెచ్చిన ఇందూరు బిడ్డ..ఎమ్మెల్సీ కవిత అని కొనియాడారు. 3196 తండాలను గ్రామ పంచాయతీలుగా చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని తెలిపారు. తండాల్లో నీటి ఎద్దడి లేకుండా మిషన్ భగీరథతో ఇంటింటికీ తాగునీటిని అందిస్తున్నారని తెలిపారు. కేసీఆర్ చేస్తున్న అభివృద్ధిలో మంత్రిగా పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. హైదరాబాద్‌లో బంజారా భవన్ నిర్మించిందే తెలంగాణ ప్రభుత్వమని అన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాతే సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అధికారమిస్తే బీజేపీ ప్రభుత్వం తండాకో సేవాలాల్ గుడి కట్టిస్తానంటున్నదని, దేశంలో 14కోట్ల గిరిజనులు ఉన్నారని, ప్రేమ ఉంటే పార్లమెంటు వద్ద బంజారా భవనం కట్టాలని చాలెంజ్ చేశారు. అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో సేవాలాల్ గుడులు నిర్మించారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో రూ.4వేల పింఛన్ ఇవ్వాలని హితవు పలికారు. బాజిరెడ్డి గోవర్ధన్ గిరిజన పుత్రుడని, మంచి చేసేవారిని గుర్తుపెట్టుకొని మరోసారి గెలిపించాలని కోరారు.

## గిరిజనుల జీవితాల్లో వెలుగులు

**ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**



మహిళ సమస్యను తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ కవిత

సీఎం కేసీఆర్‌కు గిరిజనులంటే ఎంతో ఇష్టమని, తెలంగాణ వచ్చిన తర్వాతే గిరిజనుల జీవితాల్లో వెలుగులు నిండాయని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. రాష్ట్రంలోని 10లక్షల మంది పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి రావడానికి గిరిపుత్రులే కారణమన్నారు. రాష్ట్రం ఏర్పాటుకు ముందు గిరిజనుల రిజర్వేషన్ ఆరు శాతం ఉంటే.. స్వరాష్ట్రంలో తొమ్మిది శాతం రిజర్వేషన్ అమలు చేశామన్నారు. 2014లో రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల రిజర్వేషన్ల పెంపు కోసం తీర్మానం చేసి కేంద్రానికి పంపినట్లు గుర్తుచేశారు. ప్రధానమంత్రి మోదీ రిజర్వేషన్ శాతం పెంచకపోవడంతో సీఎం కేసీఆర్ రిస్క్ తీసుకొని పది శాతం రిజర్వేషన్ అమలు చేసినట్లు చెప్పారు. దీంతో విద్యా, ఉద్యోగాల్లో లాభం చేకూరుతున్నదన్నారు. రిజర్వేషన్ పెంచినప్పటి నుంచి దాదాపు నాలుగు వేల మంది లబ్ధి పొందినట్లు తెలిపారు. ఎస్టీలకు ప్రత్యేక నిధులు కేటాయించింది తెలంగాణ ప్రభుత్వమేనన్నారు. రైతు బీమా, రైతుబంధు, పోడు పట్టాలు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. 8వేల మంది గిరిజనులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, మారుమూల తండాలను జీపీలుగా మార్చామన్నారు. 60ఏండ్లు పాలించిన వారు ఏమీ చేయలేదని, తొమ్మిదేండ్లలో ఎంతో అభివృద్ధి చేశామన్నారు. తేడా ఉందో లేదో చెప్పాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక హాస్టళ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## గిరిజన తండాల రోడ్లకు రూ.90కోట్లు

**ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్**



మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

గిరిజనుల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ ప్రాధాన్యమిస్తున్నారని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. పోడు పట్టాల పంపిణీ, 10శాతం రిజర్వేషన్ అమలు, హైదరాబాద్‌లో బంజారా భవన్, తండాలను పంచాయతీలుగా చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. జిల్లా బంజారా భవన్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.2కోట్లు మంజూరు చేయగా, ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.కోటి ఇచ్చినట్లు వెల్లడించారు. కర్ణాటక ప్రజలను మోసం చేసినట్లు తెలంగాణ ప్రజలను మోసం చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు చూస్తున్నారని, స్థానికంగా ఉన్న ఎంపీ ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. పొద్దున లేస్తే సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేసుకోవడం తప్ప, ప్రజలకు చేసింది శూన్యమన్నారు. రూరల్ నియోజకవర్గంలో అన్ని తండాలను కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశామని, గిరిజన తండాల రోడ్లకు రూ.90 కోట్లు మంజూరు చేశామన్నారు. పాకాలా రామచంద్రపల్లె గ్రామాల అభివృద్ధికి, బంజారా భవనం హాస్టల్ గదులకు నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరగా రూ.5కోట్లు మంజూరు చేశారు. రోడ్ల అభివృద్ధికి రెండు రోజుల్లో నిధులు మంజూరు చేయించి జీవో విడుదల చేస్తానని హామీనిచ్చారు.



సంప్రదాయ నృత్యాలతో నేతలకు స్వాగతం పలుకుతున్న బంజారా మహిళలు